క్లుప్తంగా

అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లోకి..


పార్టీలో చేరిన వారితో నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసే ఇతర పార్టీల నాయకులు పార్టీలోకి చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్‌నాయకులు దామోదర్ రెడ్డి, కృష్ణ ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, లోకేశ్, మనోజ్, కరుణాకర్, శ్రావణ్, భాను, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన


పత్తిసాగు పరిశీలనలో శాస్త్రవేత్తలు

తొగుట(దుబ్బాక): వ్యవసాయ పరిశోధన, ఏరువాక కేంద్రం తోర్నాల శాస్త్రవేత్తలు మండల పరిధిలోని గుడికందులలోని వరి, పత్తి మొక్కజొన్న పంటలను బుధవారం పరిశీలించారు. వర్షాల కారణంగా పొలాల్లో నిలిచిన మురుగునీటిని తొలగించే విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. పత్తిలో సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టే ముందు అధికారుల సలహాలు, సూచనలను తీసుకోవాలని సూచించారు. మొక్కజొన్న ఎక్కువ నీటిని తట్టుకోలేదు కాబట్టి నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. శాస్త్రవేత్తలు ఎస్.శ్రీదేవి, ఉమారాణి, రమాదేవి, పల్లవి, మండల ఏఓ మోహన్, ఏఈఓలు దేవేందర్, జమీల్, రైతులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత


రోడ్లను పూడ్చుతున్న చైర్‌పర్సన్ రజిత


హుస్నాబాద్: పట్టణంలోని 8, 9వ వార్డుల్లో బుధవారం రోడ్లపై ఉన్న గుంతలలో డస్ట్ పోసి పూడ్చివేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ వర్షా కాలంలో రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, చిన్నచిన్న గుంతలను మట్టిపోసి వాటిని నివారించాలని కోరారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఇంటి పరిసరాల్లో నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు వేణు, శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 52 కేసులు


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలో మంగళవారం రాత్రి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 52మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా నివారించడానికి తరచూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛబడి నిర్వహణ భేష్


మొక్క నాటుతున్న నారాయణరావు

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీలో స్వచ్ఛబడి నిర్వహణ బాగుందని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన విభాగం(సీడీఎంఏ)జాయింట్ డైరెక్టర్, ఉమ్మడి మెదక్ జిల్లా పచ్చదనం కార్యక్రమం ప్రత్యేక పరిశీలకుడు నారాయణరావు అన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బుస్సాపూర్‌లో ప్లాస్టిక్ పునర్వినియోగం యూనిట్‌ను సందర్శించారు. కమిషనర్ ప్రేరణ పాండ పాల్గొన్నారు.

బురద దారి.. ఎలా చేరేది?

రైతే రాజంటారు. కాని రైతులు సమస్యలతో సతమతమవుతుంటే ఎవరూ పట్టించుకోరు. చాలా గ్రామాల్లో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సరైన దారులు లేవు. ఉన్నవాటిలో మట్టి రోడ్లే ఎక్కువ. దీంతో వర్షాకాలంలో బురదమయంగా మారి అనేక కష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది. నాట్లువేసే దశలో నిత్యం పొలాలకు రాకపోకలు సాగించాల్సిఉంటుంది. దారులు చిత్తడిగా మారడంతో ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు.

– మర్కూక్(గజ్వేల్)

- చిత్తడిగా పానాది రహదారి
- ఎన్నో యేళ్లుగా రైతులకు ఇబ్బందులు
- రోడ్డు వేయించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు, నేతలు


బురదలో నడుచుకుంటూ వెళ్తున్న రైతులు


ఇరుక్కుపోయిన ట్రాక్టర్

తమ పొలాలకు వెళ్లే దారి బురదమయంగా మారడంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్కూక్ మండలం గంగాపూర్– యూసుఫ్‌ఖాన్‌పల్లి రైతులు తమ పొలాలకు వెళ్లే పానాది దారి రెండు కిలోమీటర్ల మేర చిత్తడిగామారింది. ఆదారి పక్కనే కొండపోచమ్మసాగర్ కాల్వ ఉండడంతో ఆ నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రయాణం నరకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ దారి పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోంది. వర్షపు నీటితో నిండిపోయి పొలాలకు వెళ్లడానికి నానాఇబ్బంది పడుతున్నారు.

ట్రాక్టర్లు ఇరుక్కుపోయి..

నాట్లువేసే సమయం కావడంతో ఎడ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలతో వెళ్లాల్సి ఉంటుంది. చిత్తడి కారణంగా దున్నడానికి వెళ్లే ట్రాక్టర్లు బురదలో ఇరుక్కుపోతున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి కూతవేటు దూరంలో ఈ దారి ఉందని, దీంతో పొలాలకు దారి వేయించాలని ఆయనకు విన్నవించుకున్నామని రైతులు తెలిపారు. త్వరలోనే వేయిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఫలితం లేదని వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు కూడా ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



పొలాల వద్దకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొన్నేళ్లు నుంచి పానాది దారి ఇలాగే ఉంది. చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్లపొదలు ఉండడంతో రాత్రి వేళల్లో వెళ్లాలంటే చాలా భయంగా ఉంటోంది. నాట్లువేసే సమయం కాబట్టి దున్నడానికి ట్రాక్టర్లు కూడా రావడంలేదు. అయినా మా సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదు.

– చిలుక రాంచంద్రం, రైతు, గంగాపూర్

రైతుల సమస్యలు పరిష్కరించండి



రోడ్డు అధ్వానంగా ఉందని ఎన్నిమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఈ రోడ్డు సమస్య పరిష్కరిస్తే చాలా మంది రైతుల ఇబ్బందులు తీరుతాయి. వర్షాకాలమైతే రైతుల గోస చెప్పుకోలేనిది. అడుగుతీసి అడుగు వేయాలంటే బయపడుతున్నాం. మా పొలాలకు వెళ్లాలంటే ఈ దారి తప్ప వేరేదారి లేదు.

– సత్యనారాయణ సింగ్, రైతు, గంగాపూర్

పరిశుభ్రత అందరి బాధ్యత

- మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి


చేర్యాల(సిద్దిపేట): పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది, కౌన్సిలర్లు

చేర్యాల(సిద్దిపేట)/కోహెడరూరల్(హుస్నాబాద్)/దుబ్బాకటౌన్/నంగునూరు(సిద్దిపేట): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ నరేందర్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కోహెడ రూరల్ మండలంలోని గోట్లమిట్టలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు రమేశ్‌రెడ్డి, ప్రమీల, సునీత తదితరులు పాల్గొన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. సీడీఎంఏ కార్యాలయ ప్రత్యేక అధికారి నారాయణరావు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత, మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్, మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. నంగునూరు మండలం ముండ్రాయిలో నిర్వహించిన కార్యక్రమంలో రమేశ్ పాల్గొని మొక్కలు నాటారు. వెంకటాపూర్‌లో ఎంపీడీఓ లక్ష్మణప్ప గ్రామస్తులకు సూచనలు చేశారు. ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కను కాపాడాలి..
– జెడ్పీ సీఈవో రమేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): నాటిన ప్రతి మొక్కను కాపాడాలని జెడ్పీ సీఈఓ రమేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని కిష్టంపేట, రసులాబాద్ గ్రామాలలో నిర్వహించిన స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి ఎస్‌కే అహ్మద్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమారస్వామి, ఎంపీఓ శ్రీనివాస వర్మ, ఏపీఓ బాల లింగం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్తుకు యువత చిత్తు కావొద్దు

- గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి
- సైబర్ నేరాలు, మత్తుపదార్థాలపై వివిధ గ్రామాల్లో అవగాహన


సిద్దిపేటఅర్బన్: మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

మర్కూక్(గజ్వేల్)/కొమురవెల్లి(సిద్దిపేట)/మర్కూక్(గజ్వేల్)/అక్కన్నపేట(హుస్నాబాద్)/సిద్దిపేట అర్బన్/గజ్వేల్‌రూరల్: యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మర్కూక్ మండలంలోని పాములపర్తిలో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తమ పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బ్యాంక్ వివరాలను, ఓటీపీలను షేర్ చేయవద్దని సూచించారు. అలాగే పట్టణంలో ఎస్ఐ దామోదర్ కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్స్‌పాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా కొమురవెల్లి మండలంలోని గౌరయపల్లిలో ఎస్ఐ రాజుగౌడ్ సైబర్ అవేర్‌నెస్ జాగరత్ దివాస్‌లో భాగంగా సిబ్బందితో కలసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండలం రామవరం పంచాయితీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌భాస్కర్ గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు లింగాల శ్రీనివాస్, నాయకులు నరేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామంలో సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ పర్యటించి సెన్సాఫ్ సెక్యూరిటీ గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులు ముందుకు రావాలన్నారు. ఆయన వెంట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు. గజ్వేల్‌లోని ప్రగతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీఐ సైదా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి..

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్


గురుకులాన్ని పరిశీలిస్తున్న వెంకటయ్య

దుబ్బాక: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. మండలంలోని రామక్కపేట ఎస్సీ బాలికల గురుకులాన్ని బుధవారం సందర్శించారు. గురుకులంలో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. విద్యా బోధన, భోజనం, ఇతర వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న గదుల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. అనంతరం లచ్చపేట మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీరామ్‌రెడ్డి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత, ప్రిన్సిపాల్స్ శారద, సుప్రియ, ఎంఈఓ ప్రభుదాస్ పాల్గొన్నారు.

'మండల్ కమిషన్' అమలు చేయండి

హుస్నాబాద్: మండల్ కమిషన్ సూచించిన 38సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల్ కమిషన్ అమలుకు ఆమోదం తెలిపిన రోజుగా పాటిస్తూ బుధవారం వారు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జేఏసీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ ఈ రోజును బీసీల ఆత్మగౌరవాన్ని నిలుపుకున్న రోజుగా అభివర్ణించారు. మండల్ కమిషన్ సిఫారసులకు ఆనాటి ప్రధాని వీపీ సింగ్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, 1993 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 27శాతం రిజర్వేషన్లను ప్రభుత్వ విద్యా సంస్థల్లో అమలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు లింగమూర్తి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, జేఏసీ నాయకుడు మల్లేశం, హుస్సేన్, అయిలేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులకు నమస్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ప్రేరణ

అన్నలు, అక్కలు మీకు వందనాలు..

సిద్దిపేట మున్సిపాలిటీలో నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, కమిషనర్ ప్రేరణ పండ పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు చేతులు జోడించి వందనం చేశారు. ఒక వార్డులో మురుగు కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించే పనిలో నిమగ్నమైన కార్మికుల చిత్తశుద్ధిని చూసి 'సఫాయి అన్నలు, అక్కలు మీకు వందనాలు..' అంటూ కొనియాడారు.

– సిద్దిపేటజోన్

స్పాట్ అడ్మిషన్లు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో గురువారం, శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్ బుధవారం తెలిపారు. సివిల్ బ్రాంచిలో 21సీట్లు ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరై ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్సాన్‌పల్లి, డీఎక్స్ఎస్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏరియాలలో గురువారం ఉదయం 10 నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సిద్దిపేట రూరల్ ఏడీఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్సాన్‌పల్లి వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా 11కేవీ, 33 కేవీ విద్యుత్‌లైన్ల తరలింపు కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

35 మందికి జరిమానా

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు, క్యాసారం చౌరస్తా, తూప్రాన్ రోడ్డు, ముట్రాజ్‌పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్డు మార్గాలతో పాటు ఔటర్ రింగురోడ్డు వద్ద వాహనాల తనిఖీలను చేపట్టగా మద్యంతాగి వాహనాలు నడుపుతున్న 35 మందిని పట్టుకున్నామన్నారు. వారిని బుధవారం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరు పర్చగా విచారణ అనంతరం వారికి రూ.23,500 జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.

నిధులు విడుదల చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న పథకాల నిధులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని బహుజన కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కన్వీనర్ శివరాత్రి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పేద ప్రజలు కొండంత ఆశతో ఉన్నారని, వెంటనే చెక్కులను పంపిణీ చేయాలని కోరారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

- ఏసీడీపీఓ ఛాయాదేవి


చిన్నకోడూరులో చిన్నారులకు అన్న ప్రాసన చేస్తున్న ఏసీడీపీఓ ఛాయాదేవి

చిన్నకోడూరు(సిద్దిపేట)/దుబ్బాక/చేర్యాల(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట): బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని ఏసీడీపీఓ ఛాయాదేవి అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలను పట్టించాలని, ముర్రుపాలు రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు. దుబ్బాక పట్టణంలో తల్లిపాల వారోత్సవాల్లో చైర్ పర్సన్ గన్నె వనిత పాల్గొని సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ రమేశ్‌కుమార్, 13వ వార్డు కౌన్సిలర్ ఆశ సులోచనస్వామి, సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్వాడీ టీచర్లు సుజాత, శిరీష, రేణుక తదితరులు ఉన్నారు. అలాగే చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో అంగన్‌వాడీ టీచర్లు కత్తుల ఆండాళ్లు, గర్నెపల్లి ఉపేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని నర్సింహులపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి హాజరయ్యారు. టీచర్ సుభద్ర, హెచ్ఎం రేణుక, పద్మ, రమ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి

- సీపీ అనురాధ


స్టార్‌ను బహూకరిస్తున్న సీపీ అనురాధ, అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: పదోన్నతులు బాధ్యతలను మరింత పెంచుతాయని పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఏడుగురిని ఆమె తన కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదోన్నతి పొందిన సిబ్బంది మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలందించాలన్నారు. క్రమశిక్షణతో విధులపై బాధ్యతగా వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **గ్రామానికి సేవ చేయడం సంతోషం**

సిద్దిపేటరూరల్: సొంత గ్రామమైన చింతమడకకు సేవ చేసుకోవడం చాలా సంతోషకరంగా ఉందని బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్ర ఇన్‌చార్జి, కేఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. సొంత నిధులతో నిర్మించిన చింతమడకలోని పట్టాభి రాముడి ఆలయ ముఖద్వారాన్ని తన చిన్నతాత బాలకిషన్‌రావు, సోదరుడు కన్నారావుతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హంస కేతన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

◆ **రక్షణే లక్ష్యంగా ముందుకు..**

సిద్దిపేటరూరల్: ప్రజలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏసీపీ మధు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నగుండవెల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత పోలీసు అధికారులుకు సమాచారం అందించాలన్నారు. సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **డీఏలు మంజూరు చేయాలి**

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన డీఏ బకాయిలు ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్ డిమాండ్ చేశారు. శనిగరం, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, కూరెల్ల, కోహెడ, వింజపల్లి, వరికోలు, రాంచంద్రాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయులను న్యాయం జరిగేలా చూడాలన్నారు. శ్రీనివాస్, హరిదాస్, అబ్దుల్, కరీం రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సాగునీటిని విడుదల చేయండి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): జిల్లాలోని కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టుల ద్వారా సాగునీరును సరఫరా చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దయానంద్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వర్షపాతం తక్కువగా ఉన్నందున కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా చేబర్తి పెద్ద చెరువును నింపాలని, కూడవెళ్లి, హల్దీవాగు ద్వారా చెరువు, కుంటలను నింపాలని కోరారు.

◆ **రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం**

తొగుట(దుబ్బాక): రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం తొగుటలో ఆయన మాట్లాడుతూ... రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మల్లన్న సాగర్ నీటిని తరలించేందుకు ప్రక్రియ మొదలు పెడుతున్నామన్నారు. నాలుగు రోజుల పాటు సాగు నీటి పంపింగ్ కొనసాగుతుందని చెప్పారు.

◆ **పోగొట్టుకున్న ఫోన్ అందజేత**

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని చిన్నగుండవెల్లికి చెందిన రాంరెడ్డి తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఫిర్యాదు స్వీకరించి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను వెతికి పట్టుకుని బుధవారం ఎస్ఐ అపూర్వరెడ్డి ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఫిషరీస్ చైర్మన్‌ను కలిసిన గంగపుత్రులు**

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో చిన్నకోడూరు గంగపుత్ర సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్థికంగా బలపడే విధంగా కృషి చేయాలని కోరారు. కార్పొరేషన్ కార్యదర్శి వెంకటేశం, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు రమేశ్, సత్తయ్య, శ్రీనివాస్, కనకయ్య, మల్లేశం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **చేనేతకు చేయూతనివ్వాలి**

గజ్వేల్‌రూరల్: చేనేతరంగానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజారాం, మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ కోరారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయంలో చేనేత కార్మికులను సత్కరించి ఆర్థిక సాయం అందించారు.

లక్ష్మణ్ బాపూజీకి నివాళులు

సిద్దిపేటకమాన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలి సంఘం నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేత కార్మికులకు రూ.వెయ్యి పెన్షన్ ఇవ్వాలని కోరారు.

◆ **సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం**

సిద్దిపేటజోన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ మంజుల సూచించారు. బుధవారం 28వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రేరణ, మాజీ చైర్మన్ రాజనర్స్, కౌన్సిలర్లు మల్లికార్జున్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.